చాలా చిన్నవయసులో రాజకీయాల్లోకి వచ్చి సామాన్యప్రజలకు అతి చేరువగా మసలుకొని, నిజాయితీగా, నిరాడంబరంగా బతికి, ఎందరో సమర్థులను ప్రోత్సహించిన వ్యక్తిగా కామరాజ్ స్థానం తమిళ రాజకీయాల్లో సుస్థిరం. తర్వాత దేశ ఆర్థికమంత్రిగా పేరు తెచ్చుకున్న సి.సుబ్రహ్మణ్యం, రాష్ట్రపతి స్థానానికి కూడా ఎదిగిన వెంకట్రామన్ యిత్యాది అనేకమంది మహానుభావులను పైకి తెచ్చినది కామరాజే.


రాజాజీ

తండ్రి పోయిన తర్వాత కామరాజ్ చదువు మానేసి తన మేనమామ కరుప్పయ్య బట్టలషాపులో పని నేర్చుకునేందుకు చేరాడు, అప్పట్లో డా. పి.వరదరాజులు నాయుడు వంటి స్వాతంత్ర్య యోధులు (1917లో యీయనపై దేశద్రోహం కేసు పెడితే రాజాజీ ఆయన తరఫున వాదించారు) వక్తల ఉపన్యాసాలు వినడానికి షాపు వదిలేసి తిరుగుతూంటే బంధువులకు నచ్చేది కాదు. త్రివేండ్రంలో మరో బంధువు షాపులో పనిచేయడానికి పంపేశారు. ఏం చేసినా చివరకు విరుదనగర్‌కు తిరిగి వచ్చేసి 16 వ యేట కాంగ్రెస్‌లో సభ్యుడై పోయాడు కామరాజ్. చందాలు పోగుచేసి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించి సభలు జరిపేవాడు. రాజాజీ వేదారణ్యం పాదయాత్రలో అతనూ పాల్గొని జైలుపాలయ్యాడు. కలకత్తాలోని ఆలీపూర్ జైల్లో రెండేళ్లున్నాడు. గాంధీ-ఇర్విన్ ఒప్పందం వలన విడుదలయ్యాడు కానీ అతన్ని విరుదనగర్ బాంబు కేసులో యిరికించారు. డా॥ వరదరాజులు నాయుడు, జార్జి జోసెఫ్ అతని పక్షాన వాదించి అతన్ని నిర్దోషిగా నిరూపించారు.


సత్యమూర్తి

కామరాజ్ లోని చురుకుతనం, రాజకీయ చతురత మధురై కాంగ్రెస్ సభల్లో బయటపడింది. తమిళ ప్రాంత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రాజాజీ, సత్యమూర్తి పోటీపడ్డారు. రాజాజీ అధ్యక్షుడిగా, సత్యమూర్తి ఉపాధ్యక్షుడిగా వుండడానికి ఇద్దరి మధ్య రాజీ కుదిరింది. అయితే సత్యమూర్తి వర్గం రాజాజీకి ఓట్లేసినా రాజాజీ వర్గం సత్యమూర్తి ఎన్నికలో దగా చేయబోయారు. సత్యమూర్తి చచ్చీ చెడి ఎన్నికయ్యారు. అది గమనించిన కామరాజ్ వర్కింగ్ కమిటీలో అందరూ సత్యమూర్తి అనుయాయులే ఎన్నికయ్యేట్లు చూశారు. కామరాజ్‌కు మారుపేరు "కింగ్ మేకర్". ఆ లక్షణం 1931లోనే బయటపడింది. ఆ ఏడాది రాజాజీ అధికారం చూపలేని అధ్యక్షుడిగా పొద్దుపుచ్చవలసి వచ్చింది.

ఈ ఉపకారం మర్చిపోని అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యమూర్తి అతన్ని 1936లో ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా నియమించారు. నాలుగేళ్ల తర్వాత అధ్యక్ష ఎన్నికలలో అభ్యర్థిగా కామరాజును సత్యమూర్తి ప్రతిపాదించారు. రాజాజీ కోవై సుబ్బయ్యను ప్రతిపాదించారు. కామరాజుకు 103 ఓట్లు రాగా, సుబ్బయ్యకు 100 వచ్చాయి. కామరాజుకు సహాయపడడానికి సత్యమూర్తి సెక్రటరీ అయి తన పెద్ద మనసు చాటుకున్నారు. ఆ ఏడాదే సత్యాగ్రహం చేయడానికి సమాయత్తమవుతూంటే కామరాజును మళ్లీ ఖైదు చేసి వెల్లూరు సెంట్రల్ జైల్లో పెట్టారు. జైల్లో వుండగానే విరుదనగర్ మునిసిపల్ కౌన్సిల్‌కి చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. తొమ్మిది నెలల తర్వాత జైలునుండి విడుదల అవుతూనే అతను సరాసరి మునిసిపల్ ఆఫీసుకి వెళ్లి తన పదవికి రాజీనామా చేశాడు - "జైల్లో వుండడం వలన నా పదవిని నేను న్యాయం చేయలేకపోయాను. ఇటువంటి పరిస్థితుల్లో కొనసాగడం ఎంతమాత్రం భావ్యం కాదు" అంటూ. క్విట్ ఇండియా ఉద్యమంలో మళ్లీ మూడేళ్లపాటు జైలుపాలయ్యాడు.


కామరాజ్

ఇక రాజాజీ సంగతి - ఆయన తన కూతురు లక్ష్మిని గాంధీ కుమారుడు దేవదాసుకిచ్చి పెళ్లి చేయడం ద్వారా గాంధీకి చాలా దగ్గరయ్యారు. ఆయన రాజాజీని తన 'కాన్షస్ కీపర్' అనేవారు. నెహ్రూ కూడా ఆయన మేధోసంపదను మెచ్చుకునేవారు. 1937లో ముఖ్యమంత్రి అయ్యాక రాజాజీ తీసుకున్న కొన్ని నిర్ణయాలు ద్రవిడ ఉద్యమానికి ప్రాణం పోశాయి. వాటిలో ఒకటి మద్యనిషేధం ప్రవేశపెట్టడం. గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా మద్యనిషేధం పెడుతున్నానంటూ సేలం జిల్లాలో ఆయన దాన్ని అమలు చేశారు. దాని వలన ఆదాయం తగ్గిపోయిందంటూ దాన్ని భర్తీ చేయడానికి అమ్మకం పన్ను విధించారు. (దరిమిలా నిషేధం ఎత్తేసినా, అమ్మకం పన్ను మాత్రం ఎత్తేయలేదు).

అంతేకాదు, ఖర్చు తగ్గించడానికి అంటూ వందలాది ప్రభుత్వ ప్రాథమిక

పాఠశాలలను మూసేశారు. (రాజాజీ వ్యతిరేకి అయిన కామరాజ్ తను ముఖ్యమంత్రి అవుతూనే వీటన్నిటినీ తెరిపించి జేజేలు అందుకున్నారు) ఇలా మూసేయడం నిమ్నజాతులకు విద్యాసౌకర్యాలు అందకుండా చేసి అణగదొక్కడానికే అని కాంగ్రెస్‌లోను, బయటా వున్న రాజాజీ వ్యతిరేకులు ఆరోపించారు. గాంధీజీ సిద్ధాంతాలలో ముఖ్యమైనది బేసిక్ విద్యావిధానం (నయీ తాలీమ్). అందరూ ఒకేరకమైన చదువు చదివి గుమాస్తా ఉద్యోగాలకై పోటీ పడడం కంటె వడ్రంగం, కుమ్మరిపని, కమ్మరిపని వంటి చేతివృత్తులలో నైపుణ్యం సంపాదించుకుంటే భుక్తికి లోటుండదని, నిరుద్యోగసమస్య తలెత్తదని దాని ప్రయోజనం.

ఇది నిజానికి చాలా మంచి ఆలోచనే. కానీ వృత్తికీ, కులానికీ బంధం వున్న మన సమాజంలో దీనికి కులం రంగు పులిమారు. బ్రాహ్మణుడైన రాజాజీ వడ్రంగి కులస్తులను మామూలు చదువు చదువుకోనీయకుండా వడ్రంగం నేర్చుకోమంటున్నారనీ, ఆ విధంగా వాళ్లను తమను కులవృత్తులకు కట్టిపడేస్తున్నారని ద్రవిడ ఉద్యమకారులు ప్రచారం చేశారు. నిజానికి ఆ స్కూళ్లలో ఎవరు ఏది కావాలంటే అది నేర్చుకోవచ్చు. కులంతో సంబంధం లేదు. కానీ దుష్ప్రచారం అలా సాగిపోయింది. నిజానికి రాజాజీ హరిజనోద్ధరణకు హరిజన ఆలయప్రవేశం వంటి చాలా చట్టాలే చేశారు. రైతులకు ఋణవిమోచన చట్టం అమలు చేశారు. వీటికి పేరు రాలేదు కానీ ఆ బేసిక్ స్కూళ్లకు మాత్రం చెడ్డపేరు పుష్కలంగా వచ్చింది. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**